దశదినకర్మకు హాజరైన ఎమ్మెల్యే

వెంకటరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

శివ్వంపేట, అక్టోబర్ 22 : మండలంలోని దంతాన్‌పల్లి గ్రామానికి చెందిన రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు, ఉపసర్పంచ్ నాగేశ్వర రావు తండ్రి ములుగు వెంకటరావు దశదినకర్మ కార్యక్రమానికి నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకటరాంరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణాగౌడ్, ఆత్మకమిటీ చైర్మన్ గొర్రె వెంకట్‌రెడ్డి, సర్పంచ్‌లు కన్నారం దుర్గేశ్, పెంజర్ల శ్రీనివాస్‌యాదవ్, ఎంపీటీసీ ఆకుల ఇందిరాశ్రీనివాస్, సీనియర్ నాయకులు లక్ష్మారెడ్డి, జగజీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ లీకేజీ ఘటనలో మరొకరు మృతి

పండరి (ఫైల్)

వెల్దుర్తి, అక్టోబర్ 22 : మండలంలోని ఉప్పులింగాపూర్ గ్రామంలో ఈ నెల 13న సిలిండర్ లీకేజీ కావడంతో తీవ్ర గాయాలపాలైన కుంట్ల పండరి(45) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతూ ఆరోగ్య పరిస్థితి విషమించి, ఆదివారం మృతి చెందాడు. ఉప్పులింగాపూర్‌లో ఈ నెల 13న గ్రామానికి చెందిన వడ్ల వీరమణి స్థానికుడు పాండరిని గ్యాస్ సిలిండర్ తీసుకురమ్మని కోరింది. పాండరి వెల్దుర్తిలో గ్యాస్ సిలిండర్‌ను తీసుకెళ్లి వీరమణి ఇంట్లో గ్యాస్ స్టౌవ్‌కు బిగించి వెలిగిస్తుండగా మంటలు చెలరేగాయి. వీరమణి, పాండరితోపాటు మరో ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలు కాగా, ఇల్లు ధ్వంసమైంది. తీవ్రంగా గాయపడిన వీరమణి ఈ నెల 17న మృతి చెందగా, పండరి ఆదివారం మృతి చెందాడు. గ్యాస్ సిలిండర్ లీకేజీ ఘటనలో గాయడిన శ్యామల, వరలక్ష్మి ఇప్పటికీ దవాఖానలో చికిత్స పొందుతున్నారు. గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో ఇద్దరు మృతి చెందడం, మరో ఇద్దరు దవాఖానలో చికిత్స పొందుతుండడంతో గ్రామంలో విషాధచాయలు అలుముకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రాములు(ఫైల్)

చేగుంట, అక్టోబర్ 22 : వ్యవసాయ పొలానికి నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తిని ఆటో ఢీ కొట్టడంతో ఆ వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందిన సంఘటన చేగుంట మండలపరిధిలోని రుక్మాపూర్ గ్రామంలో ఆదివారం జరిగింది. రుక్మాపూర్ గ్రామానికి చెందిన కంచన్‌పల్లి రాములు (70) పొలం వద్దకు నడుచుకుంటూ వెళ్తున్న సమయంలో బోనాల గ్రామం నుంచి వేగంగా వచ్చిన ఆటో ఢీకొట్టడంతో రాములు అక్కడిక్కడే మృతి చెందాడు. చేగుంట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. బతుకమ్మ పండగ రోజు రాములు మృతి చెందడంతో గ్రామంలో విషాదం అలుముకున్నాయి.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి ఆత్మహత్య

చిన్నశంకరంపేట, అక్టోబర్ 22 : అనుమానాస్పదస్థితిలో చెట్టుకు ఉరి వేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చిన్నశంకరంపేటలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాలు..

వెల్దుర్తి మండలం ఉప్పులింగాపూర్ గ్రామానికి చెందిన పట్నం నగేశ్(42)కు చిన్నశంకరంపేట మండలం రుద్రారం గ్రామానికి చెందిన పద్మతో 18ఏండ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు. ఏడాది క్రితం ఇద్దరి మధ్య గొడవలు రావడంతో భార్య పద్మ పిల్లలను తీసుకొని తల్లిగారి గ్రామానికి రుద్రారం వచ్చింది. 20రోజుల క్రితం పెద్దమనుషుల మధ్య మాట్లాడుకొని భార్యను నగేశ్ ఉప్పులింగాపూర్‌కు తీసుకువెళ్లాడు. శనివారం పని ఉన్నదని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లాడు. ఆదివారం ఉదయం చిన్నశంకరంపేటలోని కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాల సమీపంలో ఓ చెట్టుకు ఉరేసుకున్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా మృతుడు నగేశ్‌గా గుర్తించి, మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడి సోదరి లక్ష్మి ఫిర్యాదు మేరకు చిన్నశంకరంపేట ఎస్సై నారాయణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మెదక్ రూరల్ : మహిషాసురమర్ధినిగా అమ్మవారు

మెదక్ రూరల్, అక్టోబర్ 22 : దసరా ఉత్సవాలను ప్రజలు సోమవారం నిర్వహించనున్నారు. శక్తి ఆరాధనకు ప్రాధాన్యతనిచ్చే పండుగ దసరా. తొమ్మిది రోజులపాటు అమ్మవారిని రోజుకొక అలంకరణలో పూజించిన తర్వాత విజయదశమి నిర్వహించడం ఆనవాయితీ. జగన్మాత దుర్గాదేవి మహిషాసురుడనే రాక్షసుడితో 9 రోజులు 9 రూపాల్లో యుద్ధం చేసి వధించిన సందర్భంగా 10వ రోజున ప్రజలంతా సంతోషంగా ఉత్సవాలు నిర్వహించడం క్రమేణా విజయదశమిగా మారింది.

చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా విజయదశమి అని పిలుస్తారు. మనిషిలోని పది దుర్గుణాలను తొలిగించుకునేందుకు శరన్న రాత్రులు నిర్వహిస్తారు.

మహిషాసురుణ్ని వధించడానికి దుర్గదేవి అష్టభుజాలతో అవతరించింది. దేవతలు తమ అయుధాలు ఇవ్వడంతో అది శక్తి మహావిరాట్ రూపాన్ని సంతరించుకున్నది. హిమమంతుడు ఇచ్చిన సింహాన్ని అధిరోహించి మహిషాసురుణ్ని వధించి విజయవిలాసిగా మూర్తిమత్వాన్ని చాటుకున్నది. అందువల్లే ఆయుధాల్ని పూర్వం రాజులు పూజించేవారు. కాలక్రమేణా దసరా రోజు యంత్రం, వాహన, పనిముట్లుకు పూజ చేస్తారు.

నేడు విజయదశమి

- ఊరూరా దేవీనవరాత్రి ఉత్సవాలు
- దుర్గామాత మండపాల్లో పూజలు
- పల్లెలకు తిరిగి వస్తున్న ప్రజలు
- కిటకిటలాడుతున్న మార్కెట్లు
- దసరా ఉత్సవాలకు ముస్తాబైన ఆలయాలు

విజయదశమి రోజు సాయంత్రం శమీ వృక్షం వద్ద శమీ పూజ చేస్తారు. అనంతరం పాలపిట్టను చూసి, శమీ ఆకును పెద్దవారికి ఇచ్చి పాదాభినందనం చేసి ఆశీర్వాదం తీసుకుంటారు. శమీ వృక్షాన్ని దర్శించి పూజిస్తే విజయం సిద్ధిస్తుంది.

దసరా ఉత్సవాలు మెదక్ జిల్లావ్యాప్తంగా ప్రజలు ఘనంగా నిర్వహిస్తారు. ఉత్సవాలకు ఆలయాలను ముస్తాబు చేశారు.



కొల్చారం : రంగంపేటలో దీపారాధన చేస్తున్న భక్తులు

దుర్గాదేవీకి ప్రత్యేక పూజలు

మెదక్ రూరల్, అక్టోబర్ 22 : విజయదశమి ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు అదివారం దుర్గామాత మహిషాసురమర్ధిగా భక్తులకు దర్శనమించారు. మెదక్ మండలం మాచవరం గ్రామంలో అమ్మవారికి 54 రకాల పిండివంటలతో నైవేద్యం సమర్పించి, భక్తులకు అన్నదానం చేపట్టారు.

కలువ పూలతో అమ్మవారికి అలంకరణ

రామాయంపేట, అక్టోబర్ 22 : పట్టణంలో అమ్మవారు దుర్గాదేవి గా భక్తులకు దర్శనమించారు. దుర్గామాతకు ముదిరాజ్ సంఘం నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని కలువ పూలతో అలంకరించారు. అనంతరం అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు.

రామాయంపేట బీసీకాలనీలో దుర్గామాతను బీఆర్ఎస్ సీనియర్ నేత కంతారెడ్డి తిరుపతిరెడ్డి దర్శించుకున్నారు. అనంతరం అన్నదానం ప్రారంభించారు. ఆయన వెంట నేతలు గజవాడ నాగరాజు, చంద్రపు కొండల్‌రెడ్డి ఉన్నారు.

నేడు మల్లన్న ఆలయంలో పూజలు

మెదక్ రూరల్, అక్టోబర్ 22 : మెదక్ మండలం మంబోజిపల్లిలో మల్లన్న ఆలయం ఉత్సవాలకు ముస్తాబైయింది.

కొనసాగుతున్న చాముండేశ్వరీ ఉత్సవాలు

చిలిపిచెడ్, అక్టోబర్ 22 : మండలం పరిధిలోని చిట్కుల్ గ్రామ శివారులో మంజీరానది తీరాన వెలిసిన చాముండేశ్వరీ ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం అభిషేకాలు చేసి అనంతరం మధ్యాహ్నం వరకు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం నుంచి రాత్రి 8 గంటల వరకు మహాపూజ, మహానివేదన, హారతి, తీర్థప్రసాద వినియోగం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు ప్రభాకర్‌శర్మ ఆధ్వర్యంలో భక్తులు అమ్మవారికి కుంకుమార్చనలు, ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు.



చిలిపిచెడ్ : చిట్కుల్ శివారులోని చాముండేశ్వరీ ఆలయంలో భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

శ్రీబగలాముఖి ఆలయ మహాద్వారానికి భూమిపూజ

శివ్వంపేట, అక్టోబర్ 23 : మండలకేంద్రం శివ్వంపేటలో నిర్మించిన భగలాముఖి శక్తిపీఠం ఆలయానికి సోమవారం హైకోర్టు సీనియర్ న్యాయవాది శివకుమార్‌గౌడ్ తన తల్లిదండ్రులు అంజమ్మ, లింగయ్యగౌడ్ జ్ఞాపకార్థం మహాద్వారం నిర్మించడానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక, ధార్మిక సేవా కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలకు తనవంతు సాయం చేస్తానని హామీ ఇచ్చారు. భక్తులు, ప్రజలు ఆలయాల అభివృద్ధికి సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో భగలాముఖి అమ్మవారి ఉపాసకులు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ, జడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా, సర్పంచ్ పత్రాల శ్రీనివాస్‌గౌడ్, ఉప సర్పంచ్ పద్మావెంకటేశ్, సీనియర్ నాయకులు సూర్యంకుమార్‌గౌడ్, ముద్దగల్ల లక్ష్మీనర్సయ్య, కొండల్, పోచాగౌడ్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

భగలాముఖిశక్తిపీఠం మహాద్వారానికి భూమిపూజ చేస్తున్న హైకోర్టు సీనియర్ న్యాయవాది శివకుమార్‌గౌడ్

ప్రజలకు విజయం సిద్ధించాలి

మెదక్, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ) : చెడు మీద మంచి, దుష్టశక్తుల మీద దైవశక్తి సాధించిన విజయానికి ప్రతీకగా నిర్వహించుకునే పండుగ దసరా. విజయదశమి పండగను అత్యంత భక్తిశ్రద్ధలతో ఆనందంగా నిర్వహించుకోవాలి. అమ్మవారి ఆశీస్సులతో మెదక్ ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలి. ప్రతి కుటుంబానికి విజయాలు సిద్ధించాలి. ప్రజలందరూ శాంతియుతంగా ఆనందోత్సాహాలతో దసరా పండగ నిర్వహించుకోవాలని శుభాకాంక్షలు తెలిపారు.

- పద్మాదేవేందర్‌రెడ్డి, మెదక్ ఎమ్మెల్యే

సిరి సంపదలతో తులతూగాలి

మెదక్ జిల్లా ప్రజలకు ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి దసరా శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి, దుష్ట శక్తుల మీద దైవశక్తులు సాధించిన విజయానికి గుర్తుగా దసరా పండుగ జరుపుకొంటున్నామని అన్నారు. చెడు ఎంత దుర్మార్గమైనదైనా, ఎంత శక్తిమంతమైనదైనా అంతిమ విజయం మంచినే వరిస్తున్నదనే విషయాన్ని మహిషాసురుడిపై జగన్మాత సాధించిన విజయం ప్రపంచానికి చాటింది. జగన్మాత ఆశీస్సులతో ప్రజలంతా సిరి సంపదలతో కలిగేలా దుర్గామాత దీవించాలని ఎమ్మెల్సీ ప్రార్థించారు.

- శేరి సుభాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ

ఆయురారోగ్యాలతో ఉండాలి

చెడుపై సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి అని, దసరా పండుగను మెదక్ జిల్లా ప్రజలు కుటుంబ సభ్యులతో సంతోషంగా, ఆనందోత్సాహాల మధ్య నిర్వహించుకోవాలని కలెక్టర్ రాజర్షిషా ఆకాంక్షించారు. ప్రజలు ఆయురారోగ్యాలతోపాటు సుఖశాంతులతో ఉండాలని కోరారు. చేపట్టే ప్రతి కార్యక్రమంలో విజయాలు చేకూరాలని ఆకాంక్షించారు. ఓటరుగా నమోదైన ప్రతి ఒక్కరూ నైతిక బాధ్యతగా ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు.

- రాజర్షి షా, కలెక్టర్